# కాటు




పున్నయ్య పొలం నుంచి చిర్రుబుర్రులాడుతూ ఇంటికొచ్చాడు. పొద్దుటనగా అరటి తోటకు నీళ్ళ తడి పెట్ట టానికి వెళ్లాడు. తిరిగొచ్చే సరికి పొద్దు గుంకుతూ వుంది. చెలగపార, కొడవలి ఒక ప్రక్కన బెట్టి కాళ్లూ, చేతులు, ముఖం శుభ్రంగా కడుక్కొని పంచలోకి అడుగుపెట్టాడు.

భార్యను చూస్తూనే, "చిన్నోడేడి! పనిలో సాయంగుంటాడు, పొలం పంపమని చెప్పెళ్లాను గందా! రాటానికి ఏం తీపరమొచ్చిందీ?" అంటూ గయ్‌న లేచాడు.

పున్నయ్య పొలం వెళ్లేటప్పుడు చూస్తే కొడుకు ఇంకా నిద్రమంచం దిగనేలేదు. లేపటానికి మనసొప్పలేదు. కొడుకు అన్నం తిన్నాక, తనకూ మూటగట్టి పంపమని చెప్పి పొలం బొయ్యాడు. కాడి గట్టు చేను పాలేరు అన్నం పట్టుకొచ్చి ఇచ్చాడు తప్ప చిన్నయ్య పొలం రాలేదు.

"ఆడికి ఒంటో బాగోలేదు లేవయ్యా!" అంటూ సమర్థించింది మంగమ్మ.

"ఏవంటా?" అంటూ కాస్త తగ్గి మాట్లాడాడు.

"పొద్దున్న లేచేసరికి జొరంగుంది. తలనొప్పి, నీరసమన్నాడు బిడ్డ. నిన్న ఆకలిలేదని అన్నం సరిగా తిన్లా." మరికొన్ని వివరాలు చెప్పింది.

"అట్టాగా! మరయితే ఆచారికాడికి తీసుకెళ్లి చూపిత్తే పోయేదిగా!"

"నడవలేనన్నాడు. ఆచారిగారికి కబురంపితే వచ్చి చూచి మందిచ్చాడు. మింగించాను" చెప్పింది.

ఆ మాటలకు పున్నయ్య ప్రాణం కొట్టుకులాడింది. నాలుగంగల్లో కొడుకు పడుకొని వున్న గదిలోకి అడుగుపెట్టాడు. కళ్లు మూసుకొని పడుకొన్న కొడుకు ముఖంలోకి తేరిపారజూశాడు. నూనూగు మీసాలు. బాల్యం తీరి యవ్వనంలోకి అడుగుపెడుతున్న వయసు చిన్నయ్యది. నలుగురూ కొడుకు అచ్చుగుద్దినట్టు తన పోలికేననటం పున్నయ్యకు కూసింత గర్వ కారణం కూడా! ఒక్కగానొక్క కొడుకు మీద వల్లమాలిన అభిమానం. కాని గారాం చేస్తే ఎక్కడ చేయి దాటిపోతాడోనని ప్రేమను కడుపులోనే దాచుకొంటాడు.

మంచం పట్టె మీద కూచుంటూ, "చిన్నయ్యా!" అంటూ ప్రేమగా పిలిచాడు. చిన్నయ్య కళ్లు విప్పి తండ్రిని చూశాడు.

"ఎట్టాగుందయ్యా?" అంటూ నుదురు మీద చెయ్యి వేసి చూశాడు. బాగా వెచ్చగా తగిలింది.

"జొరం గుంది.... ఒళ్లు నొప్పులయ్యా!" అన్నాడు పెదాలు నాలుకతో తడి చేసుకొంటూ.

"ఆచారి మందిచ్చాడుగా. తెల్లారేసరికి తగ్గిపోద్దిలే. పడుకో" అంటూ సముదాయించాడు.

పేరుకి అన్నం ముందు కూచున్నాడన్నమాటే గాని అన్నం సయించలేదు. అర్ధాకలితో లేచాడు. మంగమ్మ కూడా గ్లాసు మజ్జిగ తాగి పడుకొంది. పని చేసిన అలసటమీదున్నాడేమో నిద్రలోకి జారిపొయ్యాడు. ఒక రాత్రి కాడ మూత్ర విసర్జనకని లేచాడు. మంగమ్మ కొడుకు మంచం ప్రక్కనే చాపేసుకొని పడుకొంది. కొడుకు నడిమంచం మీద కూచుని, తండ్రికేసి నిలువు గుడ్లేసుకొని చూస్తున్నాడు.

"నిద్రపోకుండా అట్టా కూచున్నావేంది?" అడిగాడు లఘుశంక తీర్చుకొచ్చి చిన్నయ్య దగ్గర కొస్తూ.

"నిద్ర పట్టలేదయ్యా! ఏందో గుబులు గుబులుగా వుంది" చెప్పాడు చిన్నయ్య.

ఆ మాటలకు మంగమ్మకు మెలకువ వచ్చింది. పున్నయ్య కొడుకు వంటి మీద చెయ్యేసి చూశాడు. వళ్ళు వెచ్చగా కాలిపోతోంది. తలకు తడిగుడ్డ పట్టీ వెయ్యమని భార్యకు పురమాయించాడు. జ్వరం తగ్గుముఖం పడ్తేగాని కొడుకు ప్రాణం స్తిమితపడదనుకున్నాడు. మంచం మీద నడుం వాల్చాడన్న మాటే గాని తనూ సరిగా నిద్రపోలేకపొయ్యాడు.

ఉదయం ఆచారొచ్చి చిన్నయ్యను పరీక్షించాడు. జొరం తగ్గుముఖం పడ్తున్నట్టు లేదనుకొన్నాడు. తలనొప్పి, వొళ్లు నొప్పులు, రాత్రంతా కొడుక్కి కంటిమీద కునుకు లేదని గోలపెట్టింది మంగమ్మ.

"ఇప్పుడొస్తున్న జొరాలు ఒక పట్టాన తగ్గుతున్నయ్యా! మందులు పవర్ పెంచి రాసిస్తాలే. రేపటికి అదే దారిలోకి వస్తుంది" అంటూ ఇంజక్షన్ కూడా చేసి, మింగటానికి మందుబిళ్లలు మార్చిచ్చాడు.

"ఓసారి గుంటూరు తీసుకెళ్లి చూపిచ్చొద్దామయ్యా?" అడిగింది మంగమ్మ.

"రేపటికి తగ్గి పోద్దంటున్నాడు గదే! పట్నం తీసుకెళ్లి చూపించాలంటే పదేలన్నా జేబులో ఏసుకెళ్లాలి. చేను తడుపు గూడా అయిపోద్దియ్యాల" అంటూ చేనుకి బయల్దేరాడు పున్నయ్య.

చేలో పని చేస్తున్నాడన్న మాటే గాని ధ్యాస ఇంటి మీదనే వుంది. ఆచారి వైద్యం మీదున్న నమ్మకంతో కాస్త స్థిమితంగా పని చెయ్యగలిగాడు. తడి పెట్టటం పూర్తయి ఇంటికొచ్చే సరికి దీపాలు వెలిగించే వేళయింది. తల నొప్పంటూ గోల పెడ్తున్న కొడుకు నుదుటికి అమృతాంజనం పట్టిస్తున్నది మంగమ్మ.

"ఎట్టుందే జొరం? ఎవన్నా తగ్గు ముఖం పట్టిందా?" అడిగాడు పున్నయ్య లోపలకొస్తూ.

"ఏం తగ్గటం! నొప్పులంటూ పిల్లాడు విలవిల్లాడతన్నాడు. అంత రొట్టి ముక్కన్నా నోట బెట్టాడు గాదు. గొంతు నొప్పంటున్నాడు. స్తిమితంగా కూచోనూ లేడు, పడుకోనూ లేడు. ఓసారి ఆచారికాడికి బోయిరా" మంగమ్మ ఆందోళన పడుతూ చెప్పింది.

పున్నయ్య మరో మాట మాట్లాడకుండా బయటకు నడిచాడు. కాళ్లీడ్చుకొంటూ ఆచారింటికి బోయాడు. ఎవరికో ఆపరేషను చేయించాల్సి కూడా టౌనుకు పొయ్యాడని ఆచారి భార్య చెప్పింది. రావటానికి పొద్దు బోతుందని చెప్పటంతో చేసేది లేక వెనుదిరిగాడు.

నడిరాత్రి దాటాక చిన్నయ్యలో రోగం తీవ్రమవుతున్న లక్షణాలు పొడచూపసాగాయి. ఉండుండి ఉలికి ఉలికి పడటం మొదలైంది. దాహం! దాహమంటూ ఒకటే గొడవ మొదలెట్టాడు. గ్లాసులో నీళ్లు తీసుకొచ్చి ఇవ్వబోతే చూస్తూనే వద్దు వద్దంటూ భయంగా అరుస్తున్నాడు. తెరలు తెరలుగా వొస్తున్న గొంతు నొప్పికి విలవిల్లాడుతున్నాడు. రెండుసార్లు ఫిట్స్‌లాగ వచ్చి మనిషి మెలికలు తిరిగి పొయ్యాడు.

'ఇదేం రోగం దేవుడా!' అనుకొంటూ భార్యాభర్తలు బేజారెత్తిపోసాగారు. ఇద్దరికీ కంటిమీద కునుకన్నది లేకపోయింది. ఎప్పుడెప్పుడు తెల్లారుతుందా అంటూ దిక్కులు చూస్తూ దిగాలుగా కూచున్నారు. తెల్లారుతూనే ఆచారింటికి పరిగెత్తాడు పున్నయ్య.

ఆచారి వచ్చి చిన్నయ్య పరిస్థితి చూశాడు. మామూలు జ్వరమనిపించలేదు. "పున్నయ్యా! పిల్లాడ్ని వెంటనే గుంటూరు తీసుకెళ్లి చూపించు. ఇప్పుడొచ్చే జొరాలు ఒక రకంగా వుంటంలేదు. ఇక ఆలస్యం మంచిది కాదు" అంటూ చేతులెత్తేశాడు ఆచారి.

ఆటోలో కొడుకును గుంటూరులో పేరున్న ఒక నర్సింగ్ హోమ్‌కి తీసుకెళ్లారు. జొరం, గొంతునొప్పి, నీళ్లు చూస్తూనే భయపడటం, ఫిట్స్ రావటం మొదలైన రోగ లక్షణాలు డాక్టర్‌కు చెప్పాడు పున్నయ్య. డాక్టర్ నిశితంగా చిన్నయ్యను పరీక్షించాడు. రోగం గురించి ఒక అవగాహనకు వచ్చాడు. హైడ్రోఫోబియా అనేది రేబిస్ వ్యాధి ముఖ్యలక్షణమని డాక్టర్‌కు తెలుసు.

"మీ వాడ్ని ఎప్పుడైనా కుక్క కరిచిందా?" ప్రశ్నించాడు.

ఊహించని ఆ ప్రశ్నకు పున్నయ్య ఖిన్నుడయ్యాడు. కొడుకు జ్వరానికి, కుక్క కరవటానికి లంకె ఏమిటో అర్థం కాలేదు. రెండేళ్ల క్రితం వీధి కుక్క కరిచిన విషయం గుర్తొచ్చింది.

"అవునండీ! రెండేళ్ల క్రితం ఒకసారి కుక్క కరిచింది" హీన స్వరంతో చెప్పాడు పున్నయ్య.

"ఇక్కడ నేను చెయ్యగల వైద్యం ఏమీ లేదు. జ్వరాల ఆసుపత్రని వేరే వుంది. వెంటనే అక్కడకు తీసుకెళ్లండి మీ అబ్బాయిని" అంటూ చేతులు దులుపుకొన్నాడు డాక్టర్.

ఆ మాటలు వింటూనే పున్నయ్యకు, మంగమ్మకు గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. ఇదేదో మామూలు జ్వరం కాదని ప్రాణాలు మీదికి తెచ్చిపెట్టేలా వుందని ఆందోళన పడసాగారు. ఆఘ మేఘాల మీద కొడుకుని తీసుకొని జ్వరాల ఆసుపత్రికి బయల్దేరారు.

పున్నయ్యను డాక్టర్ అడిగిన ప్రశ్న వెంటాడుతోంది. ఎప్పుడో కుక్క కరిచిందానికి, ఇప్పుడీ రోగానికీ వున్న సంబంధం ఏమిటన్నది అంతు బట్టటం లేదు. రెండేళ్ల క్రితం జరిగిన సంఘటన కళ్ల ముందు మెదిలింది.

"మాయదారి మందని.... మాయదారి మంద. చీకటి పడితే చాలు యీదిలోకి వెళ్లాలంటే భయ పడాల్సొత్తుంది. గయ్ గయ్ గయ్ మంటూ మీద పడి సత్తండే! యీటికి గత్తర పుట్ట." పున్నయ్య ఇంటికెళ్లేసరికి మంగమ్మ పెడుతున్న శాపనార్థాలు చెవిన బడ్డాయి.

"ఎవర్నే అట్టా తిట్టి పోత్తన్నావు?" భార్యను అడిగాడు స్నానానికి బట్టలు విడుస్తూ.

"మాయదారి కుక్క చూడు పిల్లాడ్ని ఎట్టా కరిచి పెట్టిందో. అదేదో దారి కొని పెట్టినట్టుగ, దొంగేటుగొచ్చి పిక్క పట్టిందిట. దాన్నెవన్నా అదిలించాడా, కదిలించాడా? పాడుమందని" కోపంతో రెచ్చిపోతున్నది.

"ఏరా చిన్నయ్యా! బాగా పీకిందేంట్రా?"

"లేదులేవే! అంత పెద్ద గాయం కాలా.... పన్నుగాటు పడిందంతే. అదే తగ్గిపోద్దిలే" అన్నాడు చిన్నయ్య అదేమంత పెద్ద విషయం గానట్లు.

"చేబ్రోలు గవర్నమెంట్ ఆసుపత్రికి పోయి ఇంజీషన్లు చేయించుకోరా. ఆ పాడు కుక్కకు పిచ్చిగాని ఎక్కిందేవో" చెప్పింది మంగమ్మ.

"ఆసుపత్రికా..... ఓమ్మో! బొడ్డు చుట్టూ ఇండీషన్లు పొడుత్తారేమో! నా కసలే భయం, నే బోను" అన్నాడు చిన్నయ్య.

అంతలో పొరుగింటి పాపయ్య అక్కడ కొచ్చాడు. విషయం తెలుసుకొన్నాడు. "కరిచిన కుక్క పిచ్చిది గాకుంటే ఏం పెమాదం వుండదబ్బాయ్. మనూళ్లో పిచ్చి కుక్కలు ఏడుండాయి. ఐనా ఒక పదిరోజులు దాన్ని కనిపెట్టుండు. పిచ్చిదయితే చచ్చూరుకొంటుంది. అనుమానం ఎందుకనుకొంటే లాంబోయి నాటుమందే యించుకురా. నా చిన్నప్పుడోసారి కుక్కగరిస్తే లాంమందే తిన్నా" అంటూ ఇంగ్లీషు మందుకు నాటుమందులేం తీసిపోవని ఎన్నో దృష్టాంతాలు ఏకరువు పెట్టాడు.

ఎడాపెడా ఇండీషన్లు పొడిపించుకోటం కన్నా ఈ ఉపాయమేదో బాగున్నట్టనిపించింది తండ్రీ, కొడుకులకు. లాంబోయి పసరు మందు తీసుకొచ్చారు. పదిరోజుల పాటు కుక్క గురించి ఆరా తీస్తూనే వున్నారు. చిన్నది గనుక కాలిగాయం కూడా త్వరగా మానిపోయింది.

చిన్నయ్య పరిస్థితి చూస్తూనే వెంటనే ఆసుపత్రిలో అడ్మిట్ చేసుకొన్నారు.

"కుక్క కరిచినప్పుడు ఇంజక్షన్లు చేయించలేదా?" అడిగాడు డాక్టర్.

"లేదండీ! కరిచింది మంచి కుక్కని అంతగా పట్టించుకోలేదు. ఇండీషన్లంటే పిల్లాడు భయపడతన్నాడని నాటుమందేదో ఇప్పించాను" చెప్పాడు పున్నయ్య అపరాధిలా.

"అదే మీ కొంప ముంచింది. కుక్క కరిచినప్పుడు ఏం చెయ్యాలోనన్న కనీస జ్ఞానం మీకు లేకపోయింది. కుక్క కరిచిన వెంటనే ముందు సబ్బు నీళ్లతో శుభ్రంగా గాయాన్ని కడిగితే తొంభై శాతం ప్రమాదం తప్పినట్లే. బొడ్డు చుట్టూ ఇంజక్షను చేయించే రోజులెప్పుడో పోయాయి. ఇప్పుడు కరిచినరోజు, ఏడోరోజు, ఇరవయ్యొకటోరోజు, సంవత్సరానికి, ఐదేళ్లకూ చేతికండకు ఇంజక్షన్లు చేయిస్తే ఏ ప్రమాదం వుండదు" వివరంగా చెప్పుకొచ్చాడు డాక్టర్.

"కుక్కగరిచి ఎప్పుడో రెండేళ్ళయింది. ఇప్పుడు రోగం బయట పడటం ఏంటండీ?" అమాయకంగా అడిగాడు పున్నయ్య.

"కుక్క కరిచిన వెంటనే రోగం రావాలని లేదు. కుక్క లాలాజలంలో ఈ వైరస్ సూక్ష్మక్రిములుంటాయి. మనిషిని కరవటంద్వారా గాయం నుంచి శరీరంలోకి ప్రవేశిస్తాయి. కండరాలు, నరాల్లో బాగా అభివృద్ధిచెంది, వెన్నెముక, మెదడులోకి

పోయి బాగా పెరుగుతుంటాయి. రెండేళ్లలోగా ఎప్పుడైనా రోగం బయటపడొచ్చు. ప్రాణాలు మీదికి తెచ్చిపెట్టొచ్చు". ఆ మాటలకు తాము చేసిన తప్పేంటో తెలిసొచ్చింది పున్నయ్యకు.

"డాక్టర్ గారండీ! మాకు వీడొక్కడే కొడుకు. అవసరమైతే ఎంత ఖర్చయినా పెట్టుకొంటాం. ఇంకేదన్నా దారుంటే చెప్పి మా బిడ్డ ప్రాణాలు దక్కించండి. ఈ గండం గట్టెక్కించండి" చేతులు జోడిస్తూ కళ్లనీళ్ల పర్యంతమయ్యాడు పున్నయ్య.

"చేతులు కాలాక ఆకులు పట్టుకోటం అంటే ఇదేనయ్యా! జ్వరాలు, విరోచనాలకు తామెత్తులు, ఆంచనలు కట్టించడం, పచ్చ కామెర్లు, ఉబ్బుకామెర్లకు మణికట్టు మీద కాల్పించటం, ఆకుపసరు వైద్యాలు, పాము కాటుకు, తేళ్లకాటుకు మంత్రాలు పెట్టించడం, దీర్ఘరోగాలకు నాటు వైద్యాలతో చేతులారా ప్రాణాలు మీదికి తెచ్చుకొంటున్నారు. గోటితో పొయ్యేదాన్ని గొడ్డలి దాకా తెచ్చుకోవటం అంటే ఇదే. ఇప్పుడు మా చేతుల్లో ఏం లేదు" అంటూ తేల్చి చెప్పాడు డాక్టర్.

ఆ మాటలు విన్న పున్నయ్యకు గుండెలో రాయి పడినట్లైంది. ఆసుపత్రిలో రెండ్రోజులపాటు కొడుకు అనుభవిస్తున్న నరకం చూస్తూ భోరున ఏడ్చింది మంగమ్మ. మగాడు గనుక పున్నయ్య లోపల్లోపల ఏడుస్తుండి పోయాడు. దాహం! దాహమంటూ అదే పనిగా అరవటం, తీరా తాగించబోతే నీరు చూస్తూనే వెర్రిగా కేకలు పెట్టటం. తరచూ ఫిట్స్‌తో మనిషి మెలికలు తిరగటం. నోటివెంట చొంగ ధారలు కద్తుంటే భయంతో అరుపులు. గంట గంటకూ ఆరోగ్యం దిగజారింది. ఆ స్థితిలో వున్న బిడ్డను గుడ్లప్పగించి చూడటం మినహా చెయ్యగలిగింది లేక కుమిలి కుమిలి ఏడుస్తుండి పోయారు ఆ దంపతులు.

చిన్నయ్య క్రమంగా కోమాలోకి జారిపోయాడు. ఆ తర్వాత కొద్ది గంటల్లోనే శ్వాసందక మనిషి బిగిసిపొయ్యాడు. ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపొయ్యాయి. అజ్ఞానంతో చేసిన ఒక చిన్న తప్పుకు ఇంత పెద్ద శిక్ష పడుతుందను కోలేదు ఆ అమాయక దంపతులు. ఒక్కగానొక్క బిడ్డను పోగొట్టుకొన్న వాళ్ల దుఃఖాన్ని ఎవరు మాత్రం ఓదార్చగలరు.

❄

*(జులై 2011, ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రసారం)*